క్లుప్తంగా

కృష్ణగిరి క్షేత్ర ఉత్తరాధికారిగా మహేందర్



ఉత్తరాధికారిగా నియమిస్తున్న కృష్ణస్వామి

పరిగి: మండల పరిధిలో బసిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ కృష్ణగిరి క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీ మహారాజ యోగి సద్గురు శ్రీ కృష్ణానంద స్వామి ప్రథమ పుత్రుడు మహేందర్ మహారాజ్‌ను గురువారం కృష్ణగిరి క్షేత్రం ఉత్తరాధికారిగా ప్రకటించారు. ఆయ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, గ్రామస్తుల సమక్షంలో బాధ్యతలు అప్పగించారు. ఈ క్షేత్రానికి వచ్చే భక్తులు తనను ఎలా ఆదరించారో మహేందర్‌ను కూడా అలాగే గౌరవించాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మార్కెట్‌కమిటీ చైర్మెన్ పరశురాంరెడ్డి



ప్రత్యేక పూజలో పరశురాంరెడ్డి తదితరులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరిగి మార్కెట్ కమిటీ చైర్మెన్ పరశురాంరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలో సయ్యాద్‌పల్లి గ్రామంలోని శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంబిఎం ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న గుల్షన్

కొడంగల్ రూరల్: మార్చి 1వ తేదీన ఎంబిఎం ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కీ గుల్షన్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం 11గంటల నుంచి నిర్వహించనున్న కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఏడుపాయల వద్ద ఎమ్మెల్యే పూజలు



దుర్గమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం మెదక్ జిల్లాలోని ఏడుపాయల వద్ద వన దుర్గాభవానీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ఎమ్మెల్యేను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ అప్ప, బల్వంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బడంపేట జాతరకు తరలిరావాలి

బంట్వారం: సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని బడంపేట శ్రీ భద్రకాళి సమేత రాచణ్ణస్వామి శ్రీ భ్రమరాంబమల్లికార్జున స్వామి వార్ల జాతర మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి విభూతి శివరుద్రప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4వ తేదీన ధ్వజారోహణం, శిఖర పూజ అగ్ని గుండం ఏర్పాటు ఉంటుందని తెలిపారు. 5వ తేదీన స్వామివారి పల్లకీ సేవ, అగ్ని గుండం ప్రవేశం ఉంటాయని పేర్కొన్నారు. శ్రీ భద్రకాళి దేవి సమేత రాచణ్ణ స్వామివార్ల కల్యాణ మహోత్సవం, అదే రోజు రాత్రి 7:30 గంటలకు రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకోవాలని సూచించారు.

నత్తనడకన పనులు!

- నెలలు గడుస్తున్నా..రోడ్డు వేయరా?
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



దుద్యాల్ సమీపంలో రోడ్డుపై పోసిన కంకర కుప్పలు

దుద్యాల్: దుద్యాల్ గేట్ నుంచి మండల కేంద్రం మీదుగా హకీంపేట్ గ్రామం నుంచి దాదాపూర్ గ్రామ శివారు వరకు నిర్వహిస్తున్న రోడ్డు నిర్మాణ పనులు నెలలు గడుస్తున్నా పూర్తిచేయడం లేదు. ఈ పనులు మాత్రం నత్తనడకనా సాగుతున్నాయి. మట్టి తీసే మొదలు కంకర పోసే వరకు నెమ్మదిగా నిర్వహిస్తున్నారు. ఈ రహదారి గుండా పోవాలంటే తీవ్రమైన ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తీసిన తర్వాత కొంత భాగం కంకర వేశారు. మరి కొంత భాగం కంకర తీసుకువచ్చి కుప్పలుగా రోడ్డుపై పోశారు. కానీ వాటిని రోడ్డుపై పోసి సమాంతరంగా చేయకుండా కుప్పలుగా అలాగే ఉంచారు.

వాహనాలు ఎదురెదురుగా వస్తే..

రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. వివిధ రకాల పనుల కోసం, రోజు వారి అవసరాల నిమిత్తం ప్రజలు నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు చేస్తుంటారు. రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే ప్రమాదాలు కూడా సంభవించే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. దుమ్ము లేవకుండా రోడ్డుకు నిత్యం మూడు సార్లు నీటిని పట్టిస్తున్నారని కాంట్రాక్టర్, అధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవానికి ఇక్కడ నీరు పట్టించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనులు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై ఒక వాహనం ప్రయణిస్తుంటే వెనకాల లేచే దుమ్ముతో వాహనాలు కనిపించడం లేదని చెబుతున్నారు. అలాంటి సందర్భంలో వాహనాలు ఢీ కొని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువని చెబుతున్నారు. ఈ రహదారిపై ఏదైనా అనుకోని



వాహనాల రాకపోకలతో ఎగిసి పడుతున్న దుమ్ము

ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయణికులు కోరుతున్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్



కుల్కచర్ల: ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

కుల్కచర్ల: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని పార్టీ బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం కుస్మసముద్రం గ్రామానికి చెందిన పుర్ర బాలమ్మ ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న భరత్‌కుమార్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, సత్యం, పుర్ర చెన్నయ్య, ఆశయ్య, లక్ష్మయ్య, నర్సింలు, పెంటయ్య, భాస్కర్, వెంకట్, బాబు పాల్గొన్నారు.

స్నేహితుల కుంటుబానికి..

జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామానికి చెందిన హన్మంతు, అశోక్‌లు అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం 2002–03 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు హన్మంతు కుటుంబీకులకు రూ. 32వేలు, అశోక్ కుటుంబానికి రూ. 20వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని వారు పేర్కొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కిందింటి చంద్రయ్య మృతి పార్టీకి తీరని లోటని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రయ్య అంత్యక్రియలకు హాజరై వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

పాంబండపై భక్తులకు అన్నదానం



కుల్కచర్ల: భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న నిర్వాహకులు



బొంరాస్‌పేట: భక్తులకు అన్నదానం



బంట్వారం: భక్తులకు అన్నదానం

కుల్కచర్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో బుధవారం రాత్రి జాగరణ చేసిన భక్తులకు ఉపావాస దీక్ష విరమింపజేసేందుకు కులకచర్ల ఎంపీడీఓ, కార్యదర్శులు, సిబ్బంది ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులకు భోజనం, తీపి వంటకాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పాంబండ దేవస్థానంపై భక్తుల సౌకర్యార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాఘవేందర్, రాజశేఖర్, ఉదయ్, లాల్య తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని శివభక్తులు గురువారం ఉపావాస దీక్షలను భక్తిశ్రద్ధలతో విరమించారు. మండలంలోని బొంరాస్‌పేట సంగయ్యగుడి, నాగిరెడ్డిపల్లి పరమేశ్వర ఆలయం, మెట్లకుంటలో శివునిగుడి, రేగడిమైలారంలో మహాదేవుని ఆలయంతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి దీక్షలు విరమించారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని లింగమయ్య దేవాలయంలో గురువారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పార్వతీ పరమేశ్వరులను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కౌశల్ కేంద్రం ద్వారా ఉద్యోగ అవకాశాలు

పరిగి: నిరుద్యోగులకు ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ద్వారా ఉద్యోగ అవకాశాలు వస్తాయని పల్లవి కళాశాల ప్రిన్సిపాల్ తేజ సూచించారు. గురువారం పల్లవి డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం బ్రాంచ్‌లో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంకేకే కేంద్రం ద్వారా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, వృత్తి కోర్సుల గురించి పూర్తి అవగాహన అందుతుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల ప్రక్రియ, తాజా ఉద్యోగాల సమాచారం వంటివి లభిస్తాయన్నారు. కౌశల్ సంఘంలో నిర్వహించే ఉద్యోగ మేళాలో ప్రతిఒక్కరూ పాల్గొని ఉద్యోగాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎంకెకె పరిగి సెంటర్ మేనేజర్ వినయ్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అంజనేయస్వామి జాతర

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని సంఘాయిపల్లి గ్రామ శివారులోని స్వయంభూ శ్రీఅభయాంజనేయస్వామివారి జాతర ఉత్సవాలు మార్చి 1వ తేదీ శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు అభయాంజనేయస్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర లేపనం, పుష్పార్చన, అలంకరణ, నైవేద్యం, మంగళ హారతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 10గంటలకు స్వామివారి పల్లకీ సేవ గ్రామంలో ఊరేగింపు, సాయంత్రం 6గంటలకు శ్రీప్రొద్దుటూరి ఎల్లారెడ్డి ధార్మిక ప్రవచనాలు, రాత్రి 7గంటలకు శ్రీశ్రీశ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారి శిష్య బృందంచే హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చిట్టిఘనాపూర్ గ్రామంలో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. గ్రామంలోని మల్లికార్జున దేవాలయం వద్ద గురువారం మహాపడి పూజ నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. గ్రామంలోని భక్తులు శివలింగానికి పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, శివ స్వాములు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి



కుల్కచర్ల: సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నేతలు



పూడూరు: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు



దోమ: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శివకుమార్‌రెడ్డి

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామంలో రూ.5లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల నుంచి మండలాలకు, జిల్లా రహదారులకు అనుసంధానం చేస్తూ రవాణా వ్యవస్థను అత్యుత్తమంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన చెప్పారు. పల్లెలను అభివృద్ధిపథంలోకి తీసుకవెళ్లి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, సత్యం, సలీం, అనంత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, భూపతి రెడ్డి, శరత్‌కుమార్, సంపత్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సిరిగాయపల్లి గ్రామంలో రూ. 5లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతర్ల అంజయ్య, అంబటి రాజు, ప్రభాకర్, పెద్దిని నర్సింలు, గొల్ల శ్రీనివాస్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలే లక్ష్యం

దోమ: గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ సీనియర్ నాయకుడు మాలి శివకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని లింగన్‌పల్లి అనుబంధ గ్రామమైన ఎల్లారెడ్డిపల్లిలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద మంజూరైన రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రతి వార్డులోని సమస్యలను పరిష్కరించేందుకు నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అర్జున్, నర్సింహులు, బల్ల వెంకటయ్య, భీమయ్య, దస్తయ్య, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సాజిదాబేగం



అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు

ధారూర్: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ధారూర్ మండల తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. గురువారం ధారూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో సాధన సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికుల విముక్తిపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైన బాల్యవివాహాలు చేస్తున్నారనే సమాచారం ఉంటే వెంటనే మండల అధికారులకు తెలియజేయాలన్నారు. బాల్యవివాహాలు చేసిన, అందుకు సహకరించిన చట్టరీత్యా నేరమన్నారు. బాలలను ఎవరు పనిలో పెట్టుకోవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ డైరెక్టర్ మురళీమోహన్, ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ, మండల కోఆర్డినేటర్ అంజయ్య, యండీ అసిమా, శివలక్ష్మి, ప్రకాశం, సాధన సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి జాగరణ



స్వామివారిని దర్శించుకుంటున్న శివస్వాములు



యాలాల: పూజలులో కాంగ్రెస్ నేతలు



ధారూర్: అభిషేకం చేస్తున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయం, గాడిబాయి శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీమహాదేవుని ఆలయంలో బుధవారం రాత్రి 9గంటల నుంచి 11గంటల వరకు లింగాష్టక పారాయణం, అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 11–45నుంచి లింగోద్భవ సమయాన్ని పురస్కరించుకొని శివలింగానికి శివస్వాములు భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం, విభూతి, గంధం, కుంకుమ, పసుపు సుగంధ ద్రవ్యాలతోపాటు పూలు, బిల్వ దళాలతో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. గురువారం ఉదయం మహాదేవుని భజన మండలి ఆధ్వర్యంలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యాలాల: గోవిందరావుపేటలోని లింగమూర్తి ఆలయంలో గురువారం కాంగ్రెస్ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకరవేణి నది ఒడ్డున ఆలయంలో లింగమూర్తిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, బీసీ సంఘం మండల అధ్యక్షుడు అమృతప్ప, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, నాగయ్య, వీరణ్ణ, హన్మంతు, ఖాసీం, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ధారూర్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ధారూర్ కేంద్రంలో కాల కపిలేశ్వరస్వామికి అర్ధరాత్రి లింగోద్భవ కాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేసి జాగరణ చేశారు.

పౌష్టికాహారం వడ్డించాలి

సీఐ శ్రీధర్‌రెడ్డి



కొడంగల్ రూరల్: బీసీ గురుకుల పాఠశాల వంట గదిని పరిశీలిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డించాలని సీఐ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందించే భోజన వసతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు అందజేశారు. విద్యార్థులకు అందించే సదుపాయాలు, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు సూచనలిచ్చి, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. లక్ష్యం సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జీవి సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకులాన్ని ఎంపీడీఓ రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు పదోతరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని కష్టపడి చదువుకోవాలని, సమయాన్ని వృథా చేయొద్దన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. పదోతరగతిలో వంద శాతం ఫలితాలు వచ్చేవిధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. విద్యార్థులకు సమయానుకూలంగా మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

వైభవంగా ముక్కంటి కల్యాణం

- కనుల పండుగగా స్వామివారి రథోత్సవం
- భక్తిశ్రద్ధలతో భక్తుల అగ్నిగుండ ప్రవేశం
- జీవన్గీలో కొనసాగుతున్న జాతర
- నేడు అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు



రథోత్సవం



పార్వతీ పరమేశ్వరుల కల్యాణ ఘట్టం

బషీరాబాద్: జిల్లాలో ప్రముఖ శైవాక్షేత్రం జీవన్గీ మహాదేవ లింగేశ్వర జాతర ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. గురువారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం అత్యంతా వైభవంగా జరిగింది. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సమక్షంలో జంగమయ్యలు సంప్రదాయ బద్ధంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. అంతకు ముందు ఉదయం తెల్లవారు జాము 5 గంటలకు ఆలయ పరిసరాల్లో అగ్నిగుండం మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం నిప్పుల మీద నడిచారు. హరహర మహాదేవ శంభో శంకర నినాదాలతో అగ్నిగుండం ప్రవేశం చేశారు. రాత్రి భక్తుల కోలాహలం మధ్య స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. జాతరకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది.

తరలిరానున్న కుస్తీ వీరులు

కాగ్నానదిలో అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు శుక్రవారం నిర్వహించనున్నారు. జిల్లాకు చెందిన కుస్తీ వీరులతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి వందల సంఖ్యలో కుస్తీ వీరులు తరలిరానున్నారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు ఆలయ కమిటీ కాగ్నానదిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కుస్తీ చూడడానికి మహిళలకు అనుమతి లేదు. జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బషీరాబాద్ ఎస్ఐ శంకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.